# అన్ని వర్గాల సంక్షేమానికి కృషి



బోథ్: కన్గుట్టలో ప్రహరీని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్, డీసీసీబీ చైర్మన్, ఎంపీపీ

- బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్

బోథ్, అక్టోబర్ 3 : అన్ని వర్గాల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కన్గుట్ట గ్రామంలో బీసీ సంఘ భవనం చుట్టూ రూ.8 లక్షల నిధులతో నిర్మించిన ప్రహరీని మంగళవారం డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ తుల శ్రీనివాస్, జడ్పీటీసీ సంధ్యారాణితో కలిసి ప్రారంభించారు. అంతకుముందు గ్రామస్తులు డప్పులు, భాజాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జాదవ్ అనిల్ మాట్లాడుతూ కుల, మతాలు, వర్గాలనే తారతమ్యం లేకుండా అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అన్నారు. గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తుందన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో పని చేస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ డీ నారాయణరెడ్డి, సర్పంచ్ మారుపాక శ్యామలారమేశ్, ఇచ్చోడ ఎంపీపీ నిమ్మల ప్రీతమ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బీ ముత్యం రెడ్డి, ఎం సుభాష్, రమేశ్, రమణ, సురేందర్‌యాదవ్, డాక్టర్ స్వామి, రాజు, వినయ్, బుచ్చన్న, రవీందర్‌యాదవ్ పాల్గొన్నారు.

**కేసీఆర్ చేసిన అభివృద్ధి గెలిపిస్తుంది**

భీంపూర్, అక్టోబర్ 3 : సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు, శాశ్వత అభివృద్ధి పనులు తనను గెలిపించి తీరుతాయని బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం కొంచావలి గుట్టపై ఆయన డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి దర్గా దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గెలుపు తర్వాత మళ్లీ ఇక్కడికి దర్శనానికి వస్తానని , కొంచావలి గుట్టను మరింతగా అభివృద్ధి చేస్తానని అన్నారు. అన్ని వర్గాల అభిమానంతో బీఆర్ఎస్ గెలుపు తథ్యమని స్పష్టం చేశారు. వారి వెంట జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, నాయకులు అశోక్‌రెడ్డి , శ్రీధర్ రెడ్డి, పెంటపర్తి లస్మన్న, కార్యకర్తలు, రైతులు ఉన్నారు.

# కేటీఆర్ సభకు తరలిరావాలి

ఖానాపూర్ రూరల్, అక్టోబర్ 3 : నిర్మల్ జిల్లా ఎన్టీఆర్ మినీ స్టేడియంలో బుధవారం ఏర్పాటు చేసిన ఐటీ శాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సభకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలిరావాలని ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ పిలుపునిచ్చారు. ఖానాపూర్ నియోజకవర్గం నుంచి వచ్చే నాయకులు ఉదయం 10-30 గంటలకు క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకోవాలన్నారు. ఈ సభకు బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## హుండీ ఆదాయం లెక్కింపు

బాసర, అక్టోబర్ 3 : నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ అమ్మవారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలను మంగళవారం లెక్కింపు నిర్వహించినట్లు ఆలయ ఈవో విజయరామారావు తెలిపారు. 74 రోజులుగా భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకలు రూ. 72లక్షల 76వేల 76, మిశ్రమ బంగారం 90 గ్రాముల 200 మిల్లి గ్రాములు, మిశ్రమ వెండి 3 కేజీల 450 గ్రాములు, విదేశీ కరెన్సీ 22నోట్లు లభ్యమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శరత్‌పాఠక్, ఎస్‌బీఐ బ్యాంకు సిబ్బంది, పోలీసు సిబ్బంది, వాగ్దేవి సొసైటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## అన్నకు ఐదేండ్ల జైలు

నెన్నెల,అక్టోబర్ 3: నెన్నెల పోలీస్ స్టేషన్ పరిధిలోని బొప్పారం గ్రామానికి చెందిన బద్దం లక్ష్మారెడ్డి, బద్దం బాపు రెడ్డి అన్నదమ్ములు . భూ పంపకాల్లో వచ్చిన తగాదాల్లో తమ్ముడు లక్ష్మారెడ్డిని చంపాలనే బాపురెడ్డి కుట్ర పన్నాడు. 2018 జూన్ 13న నెన్నెలలోని తహసీల్ కార్యాలయంలో తన భూమి విరాసత్‌కోసం వెళ్లి వస్తున్న లక్ష్మారెడ్డిపై దాడి చేసి కారంపొడి చల్లి కత్తితో చంపడానికి బాపురెడ్డి యత్నించాడు. ఈ కేసులో నేరం రుజువైనందున మంచిర్యాల అసిస్టెంట్ సెషన్ కోర్టు బాపురెడ్డికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించినట్లు నెన్నెల ఎస్ఐ పుప్పాల శ్యాంపటేల్ తెలిపారు. అప్పటి ఎస్ఐ చందర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసి నిందితుడిపై చార్జిషీట్ ఫైల్ చేశాడు. లక్ష్మణ్ పీపీ సాక్షులను ప్రవేశ పెట్టారు. నేరం రుజువు కావడంతో, దోషికి శిక్ష ఖరారైంది.

# కొంచావలి గుట్టపై జాతర

భీంపూర్, అక్టోబర్ 3 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం అర్లి(టీ) గ్రామ సమీపంలోని కొంచావలి గుట్టపై మంగళవారం జాతర నిర్వహించారు. గుట్టలపై పచ్చని చెట్ల నడుమ ఉన్న దర్గావద్ద ప్రజలు పూజలు చేశారు. తరాలుగా వస్తున్న ఆచారం ప్రకారం టేకు పత్రాలలో జొన్న గట్కు ప్రసాదం స్వీకరించారు. ఇటీవల గ్రామానికి చెందిన సర్పంచ్ గొల్లి రమాబాయి కుమారుడు, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు వైభవ్ యాదవ్, అతని స్నేహితుడు సల్మాన్ మృత్యువాత పడగా వారి ఆత్మశాంతికి ప్రార్థనలు చేశారు. జిల్లా, సమీప మహారాష్ట్ర నుంచి ప్రజలు జాతరకు తరలివచ్చారు. హాజరైన వారిలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్, జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, వైస్ఎంపీపీ గడ్డం లస్మన్న, సర్పంచ్‌లు గొల్లి రమాబాయి, లింబాజీ, అజయ్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మేకల నాగయ్య, నాయకులు శ్రీధర్‌రెడ్డి , కపిల్, అనిల్ , నరేందర్‌యాదవ్, ఉల్లాస్ దేశ్‌ముఖ్,అంబారావ్, నితిన్, వివిధ గ్రామాల ప్రజలు ఉన్నారు.



డప్పువాయిద్యాల నడుమ పూజలకు వెళ్తున్న నాయకులు

# ఏమాయికుంటలో రుషి పంచమి ఉత్సవాలు

ఇంద్రవెల్లి, అక్టోబర్ 3 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం ఏమాయికుంట గ్రామంలోని కాశుబాబా ఆలయ ఆవరణలో సురేశ్ మహారాజ్ ఆధ్వర్యంలో రుషి పంచమి ఉత్సవాలు మథురా(లబాన్) సమాజ్ కులస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. రుషి పంచమి ఉత్సవాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర నుంచి మథురా(లబాన్) సమాజ్ కులస్తులు సంప్రదాయ ఆటపాటలపై యువకులు, మహిళలు వేర్వేరుగా నృత్యాలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన కాశుబాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సురేశ్ మహారాజ్‌ను దర్శించుకొని ఆశీర్వాదం పొందారు. కులపెద్దలు ఆలయ ఆవరణలో సంప్రదాయ పచ్చిస్ ఆటను ఆడారు. మాథురా(లబాన్) సమాజ్ కులస్తుల యువకులు బృందాల వారీగా సంప్రదాయ నృత్యాలు చేశారు.



సంప్రదాయ దుస్తులతో నృత్యం చేస్తున్న మథురా(లబాన్) సమాజ్ ప్రజలు

## భార్యను వేధించిన భర్తకు ఆరు నెలల జైలు

ఎదులాపురం, అక్టోబర్ 3 : భార్యను వేధించిన కేసులో భర్తకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తున్నట్లు జేఎఫ్‌సీఎం ప్రత్యేక పీసీఆర్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి దుర్గారాణి తీర్పు వెలువరించినట్లు కోర్టు లైజన్ అధికారి ఎం గంగాసింగ్ తెలిపారు. కేసు వివరాలను లైజన్ అధికారి వెల్లడించారు. 2011 సంవత్సరంలో కామారెడ్డి జిల్లా బిక్కనూర్‌కు చెందిన అహ్మద్‌పాషాకు ఆదిలాబాద్‌లోని రవీంద్రనగర్‌కు చెందిన అస్మాఖానంతో వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలు జన్మించిన తర్వాత భర్త అహ్మద్‌పాషా రోజు మద్యం తాగి వచ్చి కొట్టడం, తిట్టడంతో పాటు అదనపు కట్నం రూ.50వేలు తీసుకురావాలని మానసికంగా వేధింపులకు గురి చేసేవాడు. దీంతో భార్య మహిళా పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించడంతో పలుసార్లు కౌన్సెలింగ్ చేశారు. అయినప్పటికీ భర్త మరకపోవడంతో 22 జనవరి 2016 ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ డీ పద్మ కేసు నమోదు చేశారు. ఏపీపీ ఎం నవీన్ ఆరుగురు సాక్షులను కోర్టులో హాజరుపరచగా మంగళవారం న్యాయమూర్తి దుర్గారాణి జరిమాన విధిస్తున్నట్లు తీర్పును వెలువరించింది.

## మహిళ పై లైంగికదాడి కేసులో ఒకరికి జైలు

ఎదులాపురం, అక్టోబర్ 3 : దళిత మహిళపై లైంగికదాడికి యత్నం, సహ దొంగతనం కేసులో ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధించింది. లైజన్ అధికారి జాదవ్ ఈశ్వర్‌సింగ్ వివరాల ప్రకారం.. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని ఓ కాలనీలో ఎస్సీ మహిళపై 2023 ఏప్రిల్ 19వ తేదీన రాత్రి 12.30 గంటలకు అదే కాలనీకి చెందిన ఆకాశ్‌సింగ్ మహిళపై లైంగికదాడికి యత్నించాడు. అరిస్తే చంపుతానని బెదిరించాడు. అలాగే ఆమె ఇంట్లో బ్యాగులో ఉన్న రూ.3120 తీసుకొని పారిపోయాడు. మహిళ ఫిర్యాదు మేరకు కాగజ్‌నగర్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రాజ్యలక్ష్మి కేసులు నమోదు చేశారు. డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేసి నివేదిక అందించారు. ఆదిలాబాద్ ఎస్సీ ఎస్టీ కోర్టు పీపీఈ కిరణ్‌కుమార్ రెడ్డి తొమ్మిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టారు. నేరం రుజువుకావడంతో ఎస్సీ ఎస్టీ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ పీ శివరాం ప్రసాద్ మంగళవారం తీర్పు వెలువరించారు. నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష ,రూ.1500 జరిమానా విధించారు.

# హెడ్ కానిస్టేబుల్ కుటుంబాన్ని ఆదుకుంటాం



సంతాపం వ్యక్తం చేస్తున్న డీఎస్పీ, అసోసియేషన్ సభ్యులు

ఎదులాపురం, అక్టోబర్ 3 : ఆదిలాబాద్‌లోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌కు చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాథోడ్ జయవంత్‌రావ్ మంగళవారం హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి చెందాడు. జిల్లాలో అనేక సంవత్సరాలుగా సేవలందించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. కుటుంబ సభ్యులకు జిల్లా పోలీస్ యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉండి అన్నిరకాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌లో డీఎస్పీ ఉమేందర్, జిల్లా పోలీసు అసోసియేషన్ సభ్యులు పార్థివదేహానికి పూలమాల వేసి సంతాపం వ్యక్తం చేశారు. తక్షణ సాయం కింద కుటుంబ సభ్యులకు రూ.20వేలు అందజేశారు. అనంతరం తన స్వగ్రామం చిందరిఖానాపూర్‌లో అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాల మధ్య పూర్తి చేశారు. ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఆర్ఐలు నవీన్, మురళి, అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, సభ్యులు చిందం దేవీదాస్, గిన్నెల సత్యనారాయణ, ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది ఉన్నారు.

# ఆటో బోల్తా : ఇద్దరి విద్యార్థులకు గాయాలు

తాంసి, అక్టోబర్ 3 : బడి పిల్లలతో ప్రయాణిస్తున్న ఆటో వాగులో బోల్తాపడిన ఘటన మంగళవారం ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని పొచ్చెర వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కప్పర్ల గ్రామానికి చెందిన గజానన్ ఆటోలో మంగళవారం రాంపూర్ గ్రామ సమీపంలోని కాన్వెంట్ స్కూల్ నుంచి విద్యార్థులను తీసుకువస్తున్నాడు. పొచ్చెర వద్ద ఆటోలో బ్యాగ్ కిందపడింది. బ్యాగ్ కోసమని డ్రైవర్ (ఓనర్) పర్బాన్ గజానన్ దిగాడు. బ్యాగ్ తీసే క్రమంలో ప్రమాదవశాత్తు ఆటో వాగులో పడిపోయింది. గమనించిన స్థానికులు వెంటనే చిన్నారులను ప్రమాదం నుంచి తప్పించారు. ఈ ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు కడదరపు ఆదిత్య, బెందరీ రక్షితకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వెంటనే దవాఖానకు తరలించారు. ప్రమాదంలో ప్రాణనష్టం తప్పిందని కప్పర్ల గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.